సుస్థిరపాలన కోసం బీజేపీని గెలిపించండి

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



బాగ్‌అంబర్‌పేటలో పాదయాత్ర చేస్తున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

అంబర్‌పేట: అభివృద్ధి, సుస్థిరపాలన కోసం పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని కేంద్రమంత్రి, బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంటు అభ్యర్థి జి.కిషన్‌రెడ్డి కోరారు. గురువారం బాగ్ అంబర్‌పేట డివిజన్‌లో పార్టీ శ్రేణులతో కలిసి ఆయన పాదయాత్ర నిర్వహించారు. పలువురిని పలకరిస్తూ బీజేపీకి ఓటు వేయాలని కోరారు. నందనవనం కాలనీ, సీఈ కాలనీ, శారదానగర్ కాలనీ, సాయిబాబానగర్ కాలనీ ప్రాంతాల్లో ఆయన విస్తృతంగా పర్యటించారు. ప్రధాని నరేంద్ర మోదీని మళ్లీ గెలిపిస్తే దేశ గౌరవం ప్రపంచ వ్యాప్తంగా మరింత పెరుగుతుందన్నారు. అంతర్జాతీయ స్థాయిలో కొన్ని శక్తులు మోదీకి వ్యతిరేకంగా పనిచేస్తున్నాయని, వాటి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉంటూ బీజేపీకి ఓటు వేయాలని కోరారు. ఆర్టికల్ 370, అయోధ్యలో రామమందిర నిర్మాణం వంటి అంశాలు, అభివృద్ధి ఎజెండాగా బీజేపీ పని చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతంరావు, మాజీమంత్రి కృష్ణాయాదవ్, నాయకులు చుక్కా జగన్, అజయ్‌కుమార్, గోవర్ధన్‌రెడ్డి, అచ్చిని రమేష్ తదితరులు పాల్గొన్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కృషి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ లక్ష్మణ్

కాచిగూడ: లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కార్యకర్తలు శక్తివంచన లేకుండా పనిచేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ పిలుపునిచ్చారు. గురువారం బర్కత్‌పురలోని బీజేపీ నగర కార్యాలయంలో జరిగిన సమావేశంలో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డితో కలిసి మాట్లాడుతూ బీజేపీ విజయాన్ని ఎవ్వరూ ఆపలేరన్నారు. బూత్ స్థాయిలో బీజేపీకి అత్యధిక ఓట్లు వచ్చేలా కృషి చేయాలని వారు పేర్కొన్నారు. సికింద్రాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గంలో బీజేపీ అత్యధిక మెజార్టీతో గెలుపొందడం ఖాయమని ధీమావ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్.గౌతంరావు, మహేందర్, శ్యామ్‌సుందర్ గౌడ్, వీరెల్లి చంద్రశేఖర్, దీపక్ రెడ్డి, ఎడెల్లి అజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు



రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్న కందగట్ల స్వామి

కాచిగూడ: 'పద్మశాలి కార్పొరేషన్ ఏర్పాటు చేసినందుకు అఖిల భారత పద్మశాలి సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి ఆధ్వర్యంలో సంఘం ప్రతినిధులు గురువారం సీఎం రేవంత్ రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో సంఘం నేతలు గడ్డం జగన్నాథం, కొక్కుల దేవేందర్, వనం దుశ్యంతల, డాక్టర్ పుట్ట పాండురంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ అధికారుల సమస్యల్ని పరిష్కరించాలి



పీఆర్‌సీ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వ్యవసాయ అధికారుల సంఘం ఆధ్వర్యంలో గురువారం పీఆర్‌సీ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించినట్లు ఆ సంఘం అధ్యక్షుడు డాక్టర్ వైద్యనాథ్, చైర్మన్ బి.కృపాకర్‌రెడ్డి తెలిపారు. అనంతరం బాగ్‌లింగంపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వ్యవసాయ అధికారుల బేసిక్ పే స్కేల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పే స్కేల్‌తో సమానంగా ఉండాలని, వ్యవసాయ అధికారులకు వాహన సదుపాయం కల్పించాలని కోరినట్లు చెప్పారు. పీఆర్‌సీ కమిషనర్‌ను కలిసినవారిలో వ్యవసాయ అధికారుల సంఘం ప్రధానకార్యదర్శి జి.కృపాకర్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ శశిధర్‌రెడ్డి, పబ్లిక్ సెక్రటరీ మానస తదితరులున్నారు.

సుందరయ్య పార్కులో సీసీ కెమెరాల ఏర్పాటు



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య పార్కులో వాకర్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ సెంట్రల్ మాజీ అధ్యక్షుడు ఎస్.రమేష్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి పి.వి. నిరంజన్‌రెడ్డిల ఆధ్వర్యంలో సుమారు 35 వేల రూపాయలతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాల ఏర్పాటుపట్ల ఉపాధ్యక్షులు వెంకటకృష్ణారావు, హౌజ్‌ఫెడ్ డైరెక్టర్ ఎ.కిషన్‌రావు, క్లబ్ మాజీ అధ్యక్షులు ఎస్.మురళీకృష్ణ, నాగభూషణంతోపాటు పలువురు వాకర్స్ హర్షం వ్యక్తం చేశారు.

చోరీకి గురైన సెల్‌ఫోన్ల అందజేత



సెల్‌ఫోన్లను అందిస్తున్న సీఐ సీతయ్య

చిక్కడపల్లి: చిక్కడపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోరీకి గురైనవారికి చెందిన సెల్‌ఫోన్లు స్థానిక ఇన్‌స్పెక్టర్ సీతయ్య గురువారం సాయంత్రం అందించారు. స్థానిక పోలీసు స్టేషన్ పరిధిలో చోరీకి గురైన సెల్‌ఫోన్లను ట్రేస్ చేసి పోగొట్టుకున్నవారికి అందించడంతో బాధితులు సంతోషం వ్యక్తం చేస్తూ సీఐకి ధన్యవాదాలు తెలిపారు. ఈ సెల్‌ఫోన్లను ట్రేస్ చేయడంలో ఎంతో చాకచక్యంగా వ్యవహరించిన పోలీసు సిబ్బందిని ఈ సందర్భంగా సీఐతో పాటు బాధితులు అభినందించారు.

పోక్సో కేసులో నిందితుడికి జైలు

నల్లకుంట: నాలుగేళ్ల క్రితం నల్లకుంట పోలీస్ స్టేషన్‌లో మైనర్ పిల్లలను లైంగికంగా వేధించాడన్న కేసులో ఓ నిందితుడిపై పోక్సో కేసు నమోదు కాగా అతనికి జైలు శిక్ష విధిస్తూ నాంపల్లి స్పెషల్ సెషన్స్ కోర్టు జడ్జి తీర్పునిచ్చారు. ఎస్‌హెచ్‌వో జగదీశ్వర్ రావు తెలిపిన వివరాలు.. శంకరమఠం సమీపంలో నివాసముండే ఆటోడ్రైవర్ బి.లక్ష్మిప్రసాద్(30)పై 2019లో మైనర్లపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడుతున్నాడంటూ ఓ వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ సమయంలో అతనిపై నల్లకుంట పీఎస్‌లో పోక్సో కేసు నమోదైంది. గురువారం ఈ కేసు పూర్వాపరాలను పరిశీలించిన నాంపల్లి స్పెషల్ సెషన్స్ కోర్టు జడ్జి నిందితుడు లక్ష్మి ప్రసాద్‌కు ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ. 2 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

గోపాలపురం పోలీసుల కార్డన్ సెర్చ్

అదుపులో 25 వాహనాలు, 5గురు రౌడీషీటర్లు



రాంగోపాల్‌పేట్: రానున్న పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో గోపాలపురం పోలీసులు గురువారం సాయంత్రం కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. గోపాలపురం ఏసీపీ సుబ్బయ్య ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, డీఐ కౌశిక్‌రెడ్డిలతో పాటు ఉత్తర మండలంలోని ఇన్‌స్పెక్టర్లు 10 మంది ఎస్సైలు, ఏఎస్‌ఐలు, 50 మంది కానిస్టేబుళ్లు, 3 ప్లాటూన్స్ సాయుధ బలగాలతో రెజిమెంటల్ బజార్‌లోని 25 లాడ్జీలను తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా లాడ్జీలలో ఉండే వారి పూర్తి వివరాలు సేకరించడంతో పాటు రికార్డుల నిర్వహణ తదితర అంశాల గురించి నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. కొన్ని లాడ్జీలలో రికార్డుల నిర్వహణ సరిగా లేకపోవడంతో వారిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ నోటీసులు జారీ చేస్తామని ఏసీపీ తెలిపారు. మరో మారు ఇలాంటి నిర్లక్ష్య వైఖరి అవలంభిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఐదుగురు రౌడీషీటర్లు, ముగ్గురు సస్పెక్ట్ షీటర్లను అదుపులోకి తీసుకున్నారు. 5 డొమెస్టిక్ సిలిండర్లు కమర్షియల్‌గా వాడుతుండటంతో వాటిని స్వాధీనం చేసికున్నారు.

నీటి పొదుపు సామాజిక బాధ్యత: రామకృష్ణ



నల్లకుంట: 'భూగర్భజలాలు అడుగంటిపోతున్న తరుణంలో ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వాడుకోవాలి. ఇంటి అవసరాలకు సరిపోయిన తర్వాత ఏరోజుకారోజు కుళాయిలను కట్టేస్తే నీటివృథాను అడ్డుకోవచ్చు'అని జలమండలి జీఎం రామకృష్ణ అన్నారు. ఈ నెల 22న(నేడు) ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ కొందరు బాధ్యతారాహిత్యంగా కుళాయిల నీటిని రోడ్లపైకి వదులుతున్నారని విచారం వ్యక్తం చేశారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని వర్షపునీటిని ఒడిసి పట్టేందుకు ప్రతి ఇంటి వద్ద వర్షపు నీటి గుంతలు ఏర్పాటు చేయించుకోవాలని సూచించారు. అలాగే వర్షాకాలంలో ఇంటా దాబాలపై నుంచి వచ్చే వర్షపు నీరు వృథాగా రోడ్లపై పోకుండా నీటి గుంతల్లోకి వెళ్లేలా పైపులు ఏర్పాటు చేయించాలన్నారు. నీటి పొదుపు సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ భావించాలన్నారు.

సాంకేతిక రంగాల్లో రాణిస్తున్న మహిళలు

మెడికల్, హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ జాయింట్ డైరెక్టర్ శశిశ్రీ



పురస్కార గ్రహీతలతో శశిశ్రీ, దైవజ్ఞశర్మ , పద్మాగోవర్ధన్

చిక్కడపల్లి: మహిళలు వంటింటికే పరిమితమవ్వకుండా ఆధునిక సాంకేతిక రంగాల్లో రాణిస్తున్నారని రాష్ట్ర మెడికల్, హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ జాయింట్ డైరెక్టర్ కె.శశిశ్రీ అన్నారు. సాంస్కృతిక, సామాజిక సేవా సంస్థ ఉజ్వల ఆధ్వర్యంలో గురువారంరాత్రి త్యాగరాయగాన సభ కళాసుబ్బారావు కళావేదికలో విశిష్ట సేవా రత్న పురస్కారాల ప్రదానోత్సవంలో ఆమె ముఖ్యఅతిథిగా మాట్లాడారు. వివిధ రంగాల్లో సేవలందించిన పలువురికి పురస్కారాలను ప్రదానం చేసి సన్మానించారు. సరస్వతి ఉపాసకులు దైవజ్ఞశర్మ అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ప్రముఖులు పద్మాగోవర్ధన్, పొన్నం అంజలి, సాయిపావని, శివనరసింహస్వామి, వీరభోగ వసంతరాయలు, ఎం.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న జయశ్రీ

కవాడిగూడ: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని, పోషక విలువలతో కూడిన ఆహారాన్ని ప్రతి ఒక్కరూ తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో జయశ్రీ, సూపర్‌వైజర్ ఉమా సూచించారు. గురువారం హిమాయత్‌నగర్ సెక్టార్ నాంపల్లి ప్రాజెక్ట్ శ్రీరాంనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ పక్షోత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీడీపీవో ముఖ్య అతిథిగా హాజరై పోషక విలువలతో కలిగిన పదార్థాలను తీసుకోవాలని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, పిల్లలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాల గురించి బాలింతలు, గర్భిణులకు, కౌమార బాలికలకు వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. ఈ విషయమై సెక్టార్ అంగన్‌వాడీ టీచర్లకు పలు సూచనలు చేశారు.

ఎన్నికల కోడ్‌పై అవగాహన



కవాతులో ఈస్ట్ జోన్ అడిషనల్ డీసీపీ, ఓయూ డివిజన్ ఏసీపీ తదితరులు

నల్లకుంట: పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో ప్రజలకు గురువారం సాయంత్రం నల్లకుంట పోలీసులు కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈస్ట్ జోన్ అడిషనల్ డీసీపీ పృథ్వీధర్ రావు, ఓయూ డివిజన్ ఏసీపీ జగన్ పర్యవేక్షణలో జండాగల్లి, వడ్డెర బస్తీ, అంజయ్యనగర్, టీఆర్టీ కాలనీ, నర్సింహబస్తీ, శంకరమఠం ప్రాంతాలలో కవాతు నిర్వహించి ఎన్నికల కోడ్ నిబంధనలపై ప్రజలకు అవగాహన కలిగించారు. ఈ కవాతులో నల్లకుంట ఎస్‌హెచ్‌వో జగదీశ్వర్‌రావు, ఎస్సైలు, నల్లకుంట, ఓయూ పోలీసు సిబ్బందితోపాటు టీఎస్‌ఎస్‌పీ సిబ్బంది, సీఐఎస్‌ఎఫ్ 850 బెటాలియన్ సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

బయటకు వెళ్లిన మేస్త్రీ అదృశ్యం



వెంకటేశం (ఫైల్)

చిక్కడపల్లి: ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన దోమలగూడ పోలీసుస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. కె.వెంకటేశం(56) వృత్తిరీత్యా మేస్త్రీ. ఆయనకు భార్య అంజమ్మ, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు రమేష్ ఉన్నారు. తన కాలికి గాయం కావడంతో డాక్టర్ల సలహా మేరకు మద్యం సేవించరాదని చెప్పారు. దీంతో ఆయన ఇంట్లో ఎవరికీ చెప్పకుండా ఈ నెల 13న బయటకు వెళ్లి ఇప్పటివరకు తిరిగి రాలేదు. ఆయన కుటుంబసభ్యులు బంధువులు, స్నేహితులు చుట్టుపక్క ప్రాంతాల్లో ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. ఆయన కుమారుడు రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు దోమలగూడ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కొన్నిరోజుల పాటు మద్యం మానేసినందుకు మానసిక వ్యథతో ఇంటినుంచి వెళ్లాడా లేక మరేమైన కారణాలతో దృశ్యమయ్యాడా అని కుటుంబసభ్యులు ఆందోళన చెందుతున్నారు.

'ఓటుతో గుణపాఠం చెప్పాలి'



మాట్లాడుతున్న కృష్ణస్వరూప్

లిబర్టీ: ఓటు ఆయుధంతో ఓటర్లు రాజకీయ పార్టీలకు తగిన గుణపాఠం చెప్పాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటు గొప్ప ఆయుధమని దళిత బహుజనులను విస్మరించిన రాష్ట్ర అభివృద్ధిని ప్రజాసంక్షేమ విస్మరించిన ప్రధాన రాజకీయ పార్టీలను లోక్‌సభ ఎన్నికల్లో తిరస్కరించాలని పిలుపునిచ్చారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... బహుజనులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలు ఎదుర్కొంటున్న సమస్యలను విస్మరించారని ఆరోపించారు. దళిత బహుజనులను చట్టసభల్లోకి పంపితే ప్రజావానిని వినిపిస్తారని దళిత బహుజనుల సమస్యలు పరిష్కారం అవుతాయని ఆయన స్పష్టం చేశారు. కొత్త కొత్త వాగ్దానాలతో హామీలతో ప్రజలను మభ్యపెట్టి కేంద్రంలో రాష్ట్రంలో అధికారం రావాలని కాంగ్రెస్ భారత రాష్ట్ర సమితి, బీజేపీలు ప్రయత్నిస్తున్నాయని ఆయా పార్టీలను వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తిరస్కరించాలని కోరారు. నేతలు ఇటికాల గణేష్, బి.సతీష్‌కుమార్, నక్క దేవేందర్‌రావు పాల్గొన్నారు.

కార్యకర్తలకు న్యాయం చేయాలని సీఎంకు వినతి



ముషీరాబాద్: రాష్ట్రంలో దశాబ్దకాలం తరువాత కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి కారణమైన కార్యకర్తలు, నాయకులకు న్యాయం చేయాలని కాంగ్రెస్ రాష్ట్ర దళిత విభాగం సీనియర్ ఉపాధ్యక్షులు అచ్చుత రమేష్‌బాబు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. గురువారం రేవంత్ రెడ్డి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎంకు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో ఘనంగా సత్కరించారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

నల్లకుంట: బాటసారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఎంతగానో దోహదపడతాయని ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ చెప్పారు. శివశంకర్ యూత్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం నల్లకుంట తిలక్‌నగర్ మెయిన్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో స్థానిక కాలనీ పెద్దలు, అసోసియేషన్ ప్రతినిధులు శ్రీనివాస్ రెడ్డి, దివాకర్ రావు, దిలీప్ జైన్, రాజేష్, గోపాల్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

రామకృష్ణ చంద్రమౌళికి గౌరవ డాక్టరేట్



గౌరవ డాక్టరేట్ అందుకున్న రామకృష్ణ చంద్రమౌళి

నల్లకుంట: అంతర్జాతీయ కవితా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఫ్రెండిషిప్ మినిస్ట్రీ యూనివర్సిటీ ప్రముఖ కవి, విమర్శకుడు రామకృష్ణ చంద్రమౌళికి గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఈ మేరకు ఇటీవల జరిగిన కార్యక్రమంలో ఫ్రెండ్‌షిప్ యూనివర్సిటీ ప్రతినిధులు రామకృష్ణకు ఈ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా పలువురు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

చెప్పల్‌బజార్‌లో కలుషితనీటికి చెక్



కలుషితనీటి సమస్యను పరిష్కరిస్తున్న జలమండలి సిబ్బంది

కాచిగూడ: చెప్పల్‌బజార్‌లో కొద్దిరోజులుగా ఇబ్బంది పడుతున్న కలుషిత తాగునీటి సమస్య పరిష్కారమైంది. ఈ మేరకు స్థానికులు సమస్యను గురువారం కాచిగూడ కార్పొరేటర్ దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే స్పందించారు. కార్పొరేటర్ కన్నె ఉమారమేష్ యాదవ్ జలమండలి ఏఈ భావన, సిబ్బంది దృష్టికి తీసుకువెళ్లి సమస్యను పరిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు బాలప్రసాద్, బి.భీమ్‌రాజ్, గణేష్, చింటు, రవి యాదవ్, రాములమ్మ, స్రవంతి, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న 'ఘంటసాల గంధర్వ గానామృతం'



ప్రముఖులను సత్కరిస్తున్న సినీనటుడు సుమన్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఘంటసాల ఆర్ట్స్ అకాడమీ హైదరాబాద్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఘంటసాల గంధర్వ గానామృతం కార్యక్రమం సభికులను ఆకట్టుకుంది. స్వరసామ్రాట్ డాక్టర్ టి.శరత్‌చంద్ర ఘంటసాల పాడిన అనేక సినిమా పాటలతోపాటు భక్తి లలిత గీతాలను ఆలపించి ఔరా అనిపించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రముఖ సినీనటుడు సుమన్, హాస్యనటుడు శివారెడ్డి, న్యాయవాది వరప్రసాద్‌లతో కలిసి www.idofandharva.orf వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. అనంతరం సుమన్ మాట్లాడుతూ ఘంటసాల వివిధ భాషల్లో పాడిన అనేక గీతాలు ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం పొందుతున్నాయన్నారు. ఈ సందర్భంగా శరత్‌చంద్రను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఘంటసాల ఆర్ట్స్ అకాడమీ అధ్యక్షులు పి.నాగేశ్వర్‌రావు, సినీనటుడు ఎస్.కుమనన్, రామకృష్ణ, విజయ్‌చౌదరి, కేవీ రాజు, డాక్టర్ వి.డి.రాజగోపాల్, విద్యాసాగర్, విజయలక్ష్మి, శివరమ్య తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలను మేనిఫెస్టోల్లో పొందుపరచాలి



మాట్లాడుతున్న వల్లభనేని ప్రసాద్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: పార్లమెంటు ఎన్నికలను పురస్కరించుకొని అన్ని రాజకీయ పార్టీలు దివ్యాంగుల సమస్యలను తమ మేనిఫెస్టోలో పొందుపరచాలని డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ ది డెఫ్(డీఎస్‌డీ) జాతీయ కన్వీనర్ వల్లభనేని ప్రసాద్ డిమాండ్ చేశారు. గురువారం డీఎస్‌డీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ఒకే విధంగా అర్హులైన దివ్యాంగులందరికీ పది వేల రూపాయల పింఛన్ ఇవ్వాలని, పార్లమెంటులో నాలుగు శాతం రిజర్వేషన్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. రేషన్ దుకాణాల్లో అన్ని రకాల నిత్యవసర సరుకులను దివ్యాంగులకు పంపిణీ చేయాలని, దివ్యాంగుల పరిరక్షణ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నేషనల్ కోకన్వీనర్ వి.భారతి, రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.వెంకటేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కరెంట్ అఫైర్స్‌పై పట్టుసాధించాలి



ప్రొఫెసర్ మల్లికను సత్కరిస్తున్న దృశ్యం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సోషల్ సైన్స్ విద్యార్థులు కరెంట్ అఫైర్స్‌పై పట్టు సాధించి వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధం కావాలని ప్రొఫెసర్ మల్లిక సూచించారు. గురువారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కళాశాలలో పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం ఆధ్వర్యంలో 'గ్లోబల్ ఇంప్యాక్ట్ ఇన్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్'అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ మల్లిక మాట్లాడుతూ సోషల్ సైన్స్ విద్యార్థులు సమాజంలో జరుగుతున్న విషయాలను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలన్నారు. అనంతరం మల్లికను సత్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శేఖర్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీధర్, అధ్యాపకులు ఎం.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


అన్నికులాలకు సముచిత న్యాయం: దానం



మున్నూరు కాపు సంఘం సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగేందర్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారానే అన్ని కులాలు, వర్గాలకు సముచిత న్యాయం లభిస్తుందని ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మున్నూరు కాపు ఫైనాన్స్ కార్పొరేషన్ ప్రకటించిన సందర్భంగా ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, మంత్రి వర్గ సభ్యులకు కృతజ్ఞతగా గురువారం సుందరయ్య విజ్ఞానకేంద్రంలో సభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న దానం నాగేందర్ మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి అండగా ఉంటూ అత్యధిక స్థానాల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత, అధికార ప్రతినిధి కొనగాల మహేష్, మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొండా దేవయ్యపటేల్, మున్నూరు కాపు డెవలప్‌మెంట్ ఫోరం అధ్యక్షుడు ఎడ్ల రవి పటేల్, రాష్ట్ర యువజన అధ్యక్షుడు బండి సంజీవ్ పటేల్, గ్రేటర్ హైదరాబాద్ యూత్ అధ్యక్షుడు దేశెట్టి శివపటేల్, ఆర్.వి.మహేందర్‌కుమార్, మహిళావిభాగం అధ్యక్షురాలు బండారు లలిత, కాసుల బాలరాజు, పుంజాల అలేఖ్య తదితరులు పాల్గొన్నారు.

కార్మిక నాయకుడు కిరణ్ మృతి



ముషీరాబాద్: సీపీఐఎంఎల్ మాస్‌లైన్(ప్రజాపంథా) జిల్లా నాయకుడు, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు, ఆటో అండ్ మోటార్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వి.కిరణ్(53) గురువారం మధ్యాహ్నం మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కిరణ్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆటో రంగ కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోవడంలో ట్రాన్స్‌పోర్ట్ అధికారులతో జరిగిన చర్చల్లో కిరణ్ పాల్గొంటూ ప్రత్యేక పాత్ర పోషించేవారు. ఆటోరంగ కార్మికుల సమస్యలపై అనేక ఉద్యమాలు నిర్వహించారు. ఆయన మృతి పట్ల సీపీఐఎంఎల్ మాస్ లైన్ గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శి ఎం.అన్మేష్, ఐఎఫ్‌టీయూ హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.ఎల్.పద్మ, వి.ప్రవీణ్ తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు.